హైదరాబాద్ వార్త



# పిసిబి ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలపై వర్క్‌షాప్

**హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త**

మనం మట్టి గణేష్ విగ్రహాలను తయారు చేద్దాం, ఇంట్లో, మన వీధుల్లో మట్టి గణేష్ విగ్రహాలను ప్రతిష్టించి పూజచేద్దాం అనే అంశం మీద విద్యార్థులతో గురువారం ప్రాజెక్ట్ అధికారి కె.సత్తయ్య మట్టి విగ్రహాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణేష్ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలచరాలకు హాని కలుగుతుందని, నీరు కలుషితమవుతుందని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించాలని అన్నారు. మట్టితో చేసిన గణేష్ విగ్రహాలనే పూజించాలని అన్నారు. మట్టితో చేసిన విగ్రహాలు పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని తెలిపారు. పూజలో ఉపయోగించే పువ్వులు, మూలికలను కంపోస్ట్ చేయాలని, మట్టిలో కలవని పదార్థాలను స్వచ్ఛమైన నీటి వనరులలో ముంచవద్దని ఈ సందర్భంగా కోరారు. ఈ సంవత్సరం వీధుల్లో, ఇళ్లల్లో ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన గణేష్ విగ్రహాలనే పూజించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల అంబర్‌పేట్ హెడ్ మాస్టర్ పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి గణేష్‌లను తయారు చేస్తున్న విద్యార్థినులు

# గణేష్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## -మేయర్ గద్వాల విజయలక్ష్మి

## -శేరిలింగంపల్లి పరిధిలో చెరువుల పరిశీలన



మల్కంచెరువు గణేష్ పాండ్‌ను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

**గచ్చిబౌలి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** రానున్న గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులకు సూచించారు. నవరాత్రి ఉత్సవాల కోసం ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని, ఎటువంటి పొరపాట్లు, అసౌకర్యాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గురువారం మేయర్ గద్వాల విజయలక్ష్మి సుడిగాలి పర్యటన చేపట్టారు. జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి, పలు విభాగాల అధికారులతో కలిసి చెరువులను పరిశీలించారు. జోన్ పరిధిలోని మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, రాయసముద్రం చెరువు, సాకి చెరువు, గంగారాం చెరువు, గౌతమి నగర్ చెరువు, దుర్గం చెరువులను పరిశీలించిన మేయర్ మల్కం చెరువులో దోమల నివారణకు మందును వదిలారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆయా విభాగాల మధ్య ఎటువంటి సమన్వయ లోపం లేకుండా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి చెరువుల్లోని బేబి పాండ్లను సిద్ధం చేయాలన్నారు. బేబి పాండ్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, బేబి పాండ్ల వద్ద విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. గణేష్ శోభాయాత్రలు జరిగే రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, ఖాజాగూడ రహదారి విస్తరణలో ఆస్థులు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జోన్ పరిధిలో చేపడుతున్న చర్యలను జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, పుష్పానాగేష్‌యాదవ్, మంజులా రఘునాథ్‌రెడ్డి, పూజితా జగదీశ్వర్‌గౌడ్, హమీద్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు హైడ్రా సెగ

## -6గురు ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిఫారసు

## -అక్రమకట్టడాలకు అనుమతులు ఇచ్చినందుకు చర్యలు

## -హైడ్రా చర్యలతో జిహెచ్ఎంపి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల్లో దడ



**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం ఉండటంతో జెట్ స్పీడుతో దూసుకెళ్తుంది. తన, మన అనేభేదం లేకుండా ఆక్రమణ అని తేలితే చాలు యాక్షన్‌లోకి దిగి పని పూర్తి చేస్తుంది. గంటల వ్యవధిలో పెద్దపెద్ద భవంతులను నేలమట్టం చేస్తుంది. ఈనేపథ్యంలో అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామని..ఇందులో తమ తప్పేముందని అధికారులను నిలదీస్తున్నారు పలువురు నిర్మాణదారులు. దీంతో హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అక్రమకట్టడాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలకు రంగం సిద్దం చేసుకున్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సైబరాబాద్ కమిషనర్‌కు సిఫార్స్ చేసినట్లు తెలుస్తుంది. అందులో చందానగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గండిపేట్ సూపరిండెంట్, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్, సర్వేయర్ ,నిజాంపేట్ ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైడ్రా సిఫార్స్ చేసినట్లు సమాచారం. దీంతో పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలు సిద్దం కావడంతో జిహెచ్ఎంసి, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల్లో దడ మొదలైంది.

### నిర్మాణదారుల్లో దడ ..

ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తారోనని భయంతో పలువురు భూఆక్రమణ దారులు గజగజ వణికిపోతున్నారు. ఏర్పాటైన కొద్దిరోజుల వ్యవధిలోనే తన విధానమేంటో స్పష్టం చేసిన హైడ్రా..సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రెటీలకు చెందిన అక్రమ కట్టడాలను కూల్చిపడేసింది. ఈనేపథ్యంలోనే ఎఫ్టీఎల్ ,బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు...చెవుల సమీపంలో ఇళ్లు కొనుగోలు చేస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. తాము తీసుకునే ప్లాట్ సరైందేనా కాదా..మేం ఎఫిఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్నామా లేదా అని తెలుసుకునేందుకు హైడ్రా కార్యాలయానికి పరుగులు తీసుకున్నారు. ఇటు అక్రమ నిర్మాణాలు కూల్చివేయడంతోపాటు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలకు అనుమతిచ్చిన అధికారుల వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్దం అవుతున్నట్లు తెలుస్తుంది.

### హైడ్రా పేరుతో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

హైడ్రా పేరుచెప్పి భయపెట్టి ..బెదిరించి కొందరు కిందిస్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాద్ తెలిపారు. గతంలో ఇచ్చిన నోటీసులు, రెండుమూడేళ్ల కిందిటి ఫిర్యాదులను అడ్డంగా పెట్టుకుని కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్ ,ఇరిగేషన్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. అటువంటివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనేపథ్యంలో అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు ఏసిబి, విజిలెన్స్ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

# ఉస్మానియా ఆసుపత్రికి కొత్త భవనం సాధ్యమేనా?

## -ఒపి,క్యూడిఎస్ భవనంలోనే వైద్యసేవలు

## -ఆసుపత్రిలో ఖాళీ స్థలంలో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం నిర్మించాలి

## -మరోసారి కమిటీ వేసి ఉస్మానియా ఆసుపత్రి పాతభవనాన్ని పరిశీంచాలి



ఉస్మానియా ఆసుపత్రి పాతభవనం

**అఫ్జల్‌గంజ్,ఆగస్టు 29ప్రభాతవార్త:**

అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్ల శని అనే చందంగా ఉంది.గత ప్రభుత్వం పదిసంవత్సరాలు తెలంగాణ పరిపాలించింది.కాని వైద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉస్మానియా ఆసుపత్రి అభివృద్ధి కోసం ఎలాంటి దృష్టి సారించడంలేదని ప్రజలు,వైద్యులు అంటున్నారు.నిజాంలో హాయంలో నిర్మించిన ఉస్మానియా ఆసుపత్రి భవనంను తొలగించి కొత్త ఆసుపత్రిన్ని నిర్మిస్తామని 8సంవత్సరాల క్రితం ఉస్మానియా ఆసుపత్రిన్ని సందర్శించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు,వైద్యులు హామి ఇచ్చారు.హామీలు,హామీలుగానే మిగిలిపోయాయి.గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 8నెలలు కావస్తుంది.కాని నిజాం హాయంలో నిర్మించిన పాతభవనం హెరిటేజ్ భవనం కావడంతో కూల్చివేయవద్దని కొందరు న్యాయం స్థానంలో కేసువేశారు.8సంవత్సరాలక్రితం ముఖ్యమంత్రిగా కొనసాగిన కెసిఆర్ ఉస్మానియా ఆసుపత్రిన్ని సందర్శించి పాతభవనాన్ని కూడా కూల్చివేసి రెండు టవర్‌లుగా నూతనంగా ఆసుపత్రిన్ని నిర్మిస్తామని ప్రకటించారు. కాని ఆచరణలో మాత్రం అమలు కాలేదు.అప్పట్లో కెసిఆర్ చేసిన తప్పునే కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఎనుముల రేవంత్‌రెడ్డికూడా ఉస్మానియా ఆసుపత్రి అభివృద్ధి విషయంలో చేస్తున్నట్లు ప్రజలు,వైద్యులు అంటున్నారు.గత ప్రభుత్వం7లక్షల కోట్ల అప్పు చేసితమకు అప్పగించిదని తరుచుగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉస్మానియా ఆసుపత్రి పాత భవనానికిహెరిటెజ్ కింద పనులను మరమ్మత్తులు చేయిస్తే సుమారు 25 ఏళ్ల నుంచి మరో50 ఏళ్ల వరకు రోగులకు, వైద్యసేవలు చేయడానికి ఆస్కారం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు.పాతభవనంలో పాత విద్యుత్ వైరింగ్,పాతమంచినీటి పైపులైన్,డ్రైనేజీ లైన్,లిఫ్ట్,కలర్స్, తదితర అభివృద్ధి పనులు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం తప్పుతుంది.20నుంచి 30కోట్ల రూపాయలను ఖర్చు చేయడం ద్వారా పాత భవనంలో సుమారు 600మంది రోగులకు వైద్యసేవలు అందించడానికి ఆస్కారం ఉంటుంది.అదే విధంగా ప్రస్తుతం గోల్డెన్ జూబ్లీ భవనం, కులీకుత్‌భ్‌షా భవనంలో స్పెషాల్టి వార్డులు అందుబాటులో ఉండే విధంగా సౌకర్యం ఉంటుంది.కాని ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని గోషామహల్ పోలీస్‌స్టేడియంలో నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.దాదాపు ఎకరాల ఉస్మానియా ఆసుపత్రి స్థలంపెరుగుతున్న రోగులకు సరిపోవడంలేదంటే.కనీసం 20 ఎకరాల స్థలంలేని గోషామహల్ పోలీస్‌స్టేడియంలోఆసుపత్రిభవనం నిర్మిస్తే రోగులకు సరిపోతుందా అనే సందేహం కలుగుతుంది.ఈవిషయంలో ప్రస్తుతం కాంగ్రెస్‌ప్రభుత్వం ఆలోచించవల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉంది. పాతభవనాన్నిమూసి వేశారని గతంలో పిసిసిఅధ్యక్షులుగా,ప్రస్తుతం మంత్రిగా కొనసాగుతున్న కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు మాజీ ఎంపి అంజన్ కుమార్‌యాదవ్,ప్రస్తుత రాజ్యసభ్యులు అనిల్‌కుమార్ యాదవ్,నూతనంగా ఎమ్మెల్సీ నియమించిన ప్రొఫెసర్ కొదండరామ్‌కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్ ఖాన్‌లు అప్పట్లో సందర్శించి గత ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు.

### ఇప్పుడు మీరు చేసే పని ఏంటీ? అనే సందేహాం కలుగుతుంది

### -ఆరుదైన కట్టడాలను కూల్చివేస్తారా చెప్పండి..లేదా పట్టించుకోరా?

పేదరోగులకు వైద్యం అందించేందుకు గాను 150 సంవత్సరాల క్రితం నిర్మించిన ఉస్మానియాఆసుపత్రి భవనంలో లక్షలాది మంది రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించి.వేలాదిమంది వైద్యనిపుణులను అందించిన ఘనత ఉస్మానియా ఆసుపత్రికి దక్కుతుంది.ఉస్మానియా ఆసుపత్రి పాతభవనాన్ని మరోసారి పరిశీలించే విధంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వైద్యనిపుణులతోపాటు అనుభవజ్ఞులైన ఇంజనీరింగ్ అధికారులతో నిజనిర్ధారణ కమిటి వేస్తే మంచిందని వైద్యులు,సిబ్బంది అంటున్నారు.దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఉస్మానియా ఆసపత్రిలో ఏటా లక్షలాది మంది నిరుపేదల రోగులు చికిత్సలు పొందుతుంటారు.ఉస్మానియా ఆసుపత్రిని నిర్వీర్యం చేయకుండా చూడాల్సిన భాద్యత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిపై ఉంది.

### -ఖాళీ స్థలంలోనే భవనం నిర్మించాలి : ప్రజలు,వైద్యులు,సిబ్బంది

చారిత్రాత్మకైన ఉస్మానియా ఆసుపత్రి పాత భవనాన్ని కూల్చివేయకుడా మరమ్మత్తులు చేయించేందుకు ప్రత్యేక నిధులను కేటాయించి..ఆసుపత్రి ప్రాంగణంలో ఖాళీగా ఉన్న స్థలంలో కొత్తం భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.గత తెలంగాణ ప్రభుత్వ ప్రతియేటా అదనంగా బడ్జెట్‌లో 100కోట్లు కేటాయించారు.ఈ నిధులు కూడా ఎక్కడిపోయో తెలియని పరిస్థితి ఏర్పడింది.కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగు నెలల కాలం పూర్తి అవుతుంది.మిగిలిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతియేటా బడ్జెట్‌లో కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం కోసం 50కోట్లు కేటాయిస్తే 200 కోట్లతో ఉస్మానియా ఆసుపత్రి ఆధునాతమైన భవనాన్ని నిర్మించవచ్చును.నాలుగు సంవత్సరాలకాలంలో కొత్త ఆసుపత్రిభవనం నిర్మాణంపై దృష్టి సారించాల్సిన అవసరం భాద్యత ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిపై ఉంది.దీనికి తోడు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూడా తగిన చర్యలు తీసుకునికొత్త ఆసుపత్రి నిర్మాణం కొరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించాల్సిన అవసరం ఉంది.ఒకవేళ భవనం నిర్మిస్తే పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 14 కిలోల గంజాయి స్వాధీనం

**కంటోన్మెంట్,ఆగస్టు 29 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చెరుకున్న గోదావరి, కోనార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జిఆర్‌పిఎఫ్, ఆర్‌పిఎఫ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వంచగా ఓ వ్యక్తి వద్ద 14 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, రైల్వే పోలీసులను గమనించిన నిందితుడు గంజాయిని బ్యాగ్‌ను వదిలేసి పారిపోయాడు. అదే విధంగా అనుమానస్పదంగా మరో వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 256 గ్రాముల గంజాయి దొరికింది. నిందితున్ని రైల్వే పోలీస్‌లు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# పండెన్‌వాగులో పోసిన మట్టిని తొలగించిన అధికారులు



మణికొండలో పండెన్‌వాగులో పోసిన మట్టిని జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పండెన్ వాగులో పోసిన మట్టిని గురువారం అధికారులు జేసీబీతో తొలగించారు. చెరువులు, కుంటలు, వరద కాలువలను రక్షించేందుకు "హైడ్రా" ప్రత్యేక చర్యలు తీసుకుంటుడటంతో మున్సిపల్ అధికారులు సైతం అప్రమత్తమై అక్రమాలపై కొరఢా ఝులిపిస్తున్నారు. ముఖ్యంగా మణికొండలో కమీషనర్ ప్రదీప్ కుమార్, టిపిఓ సంతోష్‌సింగ్‌లు అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అదనపు ఫ్లోర్ల శ్లాబులు తొలగించడం, విల్లాలను కూల్చివేయడం, ఇప్పుడు నాలాలో పోసిన మట్టిని తొలగించి కబ్జా చెర నుంచి విడిపించడం దగ్గరుండి చేస్తున్నారు. అధికారుల తీరులో వచ్చిన మార్పు పట్ల మణికొండ మున్సిపల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి మున్సిపల్ అధికారులు పని చేస్తే అవినీతి పరులు, అక్రమార్కుల భరతం పట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 100.మీటర్ల పొడవున్న పండెన్‌వాగు కాలువలో మట్టిని తొలగించిన అనంతరం టిపిఓ సంతోష్‌సింగ్ మాట్లాడుతూ, మణికొండలో ఇక నుంచి ఆక్రమణలు, అక్రమాలు జరుగకుండా చూస్తామన్నారు. పౌరులంతా చట్టం ప్రకారం నడుచుకోవాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలి

## -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న అనుదీప్‌దురిశెట్టి, డిఈవో రోహిణి తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 29,ప్రభాతవార్త:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులను సెప్టెంబర్ 10లోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డిఈవోలు, డిప్యూటీ ఐఓఎస్,డిఈలతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 384పాఠశాలల్లో పనులు చేపట్టగా ఇప్పటి వరకు 306 పాఠశాలల్లో పూరయ్యాయన్నారు. 78 పాఠశాలల్లో 80శాతం పురోగతిలో ఉన్నాయని మిగిలిన పనులను సెప్టెంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు , విద్యుత్ రిపేర్ తదితర పనులను ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డిఈవోలు , డిప్యూటీ ఐఏఎస్‌లు పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో ఉన్న సమస్యలను, పరిస్థితులను పరిశీలన చేయాలని ,ఎఫ్ఆర్ఎస్ వందశాతం నమోదయ్యేలా విద్యార్థులు హాజరు శాతం పెరిగేలా చూడాలన్నారు. అనంతరం విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యార్థుల హాజరుశాతం పెంచుటకు కృషి చేయాలన్నారు. పనితీరు సరిగా లేని డిప్యూటీ ఐవోఎస్‌లు బండ్లగూడ లక్ష్మణ్‌సింగ్ , షేక్‌పేట్ యాదగిరి, బహదూర్‌పురా 2(ఈబి)ఖలీల్ అహ్మద్, బహదూర్‌పురా కుల్దీప్ కౌర్ , ఆసిఫ్ నగర్ ఎండీ ముస్తఫాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అమ్మకాలపై ప్రత్యేక నిఘా



ఎక్సైజ్ శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి

**గోషామహల్,ఆగస్టు 29ప్రభాతవార్త:**

మహానగరంలో గంజాయి అమ్మకాలను గుర్తించి సుమారు 15నుంచి 20 కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎక్సైజ్,ఎన్‌పోర్స్‌మెంట్ డైరెక్టర్ కమల్ హాసన్‌రెడ్డి తెలిపారు.ఈమేరకుఎక్సైజ్,అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన జాయింట్ కమీషనర్ ఖురేషీ,డిప్యూటి కమీషనర్ శాస్త్రి,అసిస్టెంట్ కమీషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రణవీ,అడిషనల్ ఎస్పీ బాస్కర్,ఎక్సైజ్ సూపరిండెంటెంట్లు ప్రదీప్‌రావు, అంజిరెడ్డి,డిఎస్పీలు తులశ్రీనివాస్‌రావు,తిరుపతి యాదవ్‌లతో కలిసి గంజాయి నిర్మూలనపై చర్చించారు.దూల్‌పేటలో గంజాయి అమ్మకాలు చేపట్టే కుటుంబాలపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నిఘా పెట్టినట్లు తెలిపారు.ఇదే తీరులో జిహెచ్ఎంసి పరిదిలో డ్రగ్స్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతాలపై నిరంతరం నిఘా పెంచాలన్నారు.పట్టుబడిన కేసుల్లో శిక్షలు పడే విధాంగా చర్యలు చేపట్టాలన్నారు. దూల్‌పేటలో ఎక్సైజ్ శాఖ కంట్రోల్‌లో ఉందన్నారు.జిహెచ్ఎంసి పరిధిలో జోరుగా తనిఖీలు కొనసాగిస్తున్నామన్నారు.ఎక్సైజ్,ఎస్.టి.ఎఫ్,టిమ్‌లతో తనిఖీలు,సోదాలు చేయడం జరుగుతుందన్నారు.దూల్‌పేటజిహెచ్ఎంసి పరిధిలో ఎన్‌పిడిఎస్ డ్రగ్స్‌ను నిర్మూలించే వరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టిమ్‌లు నిష్కమించేది లేదన్నారు.జనవరి నుంచి ఆగస్టు వరకు నాటికి ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్.టి.ఎఫ్,ఇతర టిమ్‌ల పని తీరుపై డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి సమీక్షించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ మీరాలం చెరువులో మొసలి కలకలం

**చార్మినార్,ఆగష్టు 29 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న మీరాలం చెరువులో గురవారం పెద్ద మొసలి కలకలం పేరింది.మొసలిని చూసిన ప్రజలు భయాందోళనకు గురియ్యారు.నెహ్రూ జూలాజికల్ పార్కును ఆనుకుని మీరాలం చెరువు ఉంది.గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మీరాలం చెరువు నిండి పోయింది.కాగా గురువారం సాయంత్రం మీరాలం చెరువులో తిరుగుతున్న దాదాపు ఆరు అడుగల పొడవు గల మొసలిని సాయంత్రం వాకింగ్ కోసం వచ్చిన ప్రజలు చూశారు.ఈ సమాచారాన్ని అధికారులకు అందించారు.కొంత సమయం తర్వాత మొసలి తిరిగి మీరాలం చెరువులోకి వెళ్లి పోయింది. మొసలి ఎక్కడ నుంచి వచ్చిందని ప్రజలు భయపడుతున్నారు.

# విశ్వవిఖ్యాత నటుడు అక్కినేని శతజయంతి వేడుకలు

**రవీంద్రభారతి, ఆగస్టు 29 ప్రభాతవార్త :**

ప్రఖ్యాత సాంస్కృతిక సేవాసంస్థ రాగ సప్తస్వరం ఆధ్వర్యంలో తిరుమల గ్రూప్, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండి బండారు సుబ్బారావు సౌజన్యంతో విశ్వవిఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు వి.ఎస్.రాజ్యలక్ష్మి మీడియాకు తెలిపారు. సెప్టెంబరు 3 మంగళవారం శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో జరుగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, సభాధ్యక్షుడుగా తిరుమల గ్రూప్స్ ఛైర్మన్ నంగనూరి చంద్రశేఖర్ వ్యవహరిస్తారని, సభాప్రారంభకురాలిగా తెలుగుదేశం నాయకురాలు నన్నపనేని రాజకుమారి, విశిష్ట అతిథులుగా సీల్‌వెల్ బండారు సుబ్బారావు, వంశీరామరాజు, విద్యావేత్త సర్వమంగళగౌరి తదితరులు పాల్గొంటారని, గాయకులు బాలకామేశ్వరరావు, ఆమనిలు అక్కినేని సినిమాల్లోని పాటలను ఆలపిస్తారని రాజ్యలక్ష్మి వివరించారు.

## భారత జాతీయ మౌన ప్రజా పార్టీ ఆవిర్భావం

**సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మహాపురుషుల పోరాట స్ఫూర్తితో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారతీయ మౌన జాతుల ప్రజా సమితి పార్టీ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంచంద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మౌన జాతులు అంతా కలిసి ప్రజా సమితి అనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఎన్నికల్లో బిసిలకు 50 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, మైనార్టీలకు 10, ఓసిలకు 10 శాతం సీట్లు కేటాయిస్తామని చెప్పారు. దీనినే సామాజిక న్యాయం అంటారని, ఈ విధానాన్ని అర్థం చేసుకుని ఆప్రజా స్వామ్యంగా జరుపుతున్న పార్టీల పద్దతిని బద్దలు కొట్టి సామాజిక స్పృహ కలిగిన మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, కార్మికులు ఆలోచించి అందరం ఒక తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. విజిఆర్ నారగోని మాట్లాడుతూ పది శాతం కూడా అగ్ర వర్ణాలు తరతరాలుగా పదవులు అనుభవిస్తూ, 90 శాతం ఉన్న బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల మౌన జాతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.హరిముదిరాజ్, యాదగిరిగౌడ్, తాడూరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు29ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగా నిరంతరం కృషి చేస్తున్నట్లు పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్ మోహన్ తెలిపారు. కబుతర్‌ఖానా ప్రాంతంలోని డ్రైనేజీపై కప్పు మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అనుగుణంగాపైపులైన్ నిర్మాణ పనులతోపాటు వర్షంనీటి కాలువ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు మీర్‌జుల్ఫకర్‌అలీ, ఎంపి పార్లమెంట్‌సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ సహకారంతో డివిజన్ పరిధిలో లక్షలాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అభిషేక్, రాజ్‌సక్సేనా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక శాస్త్రీయ నృత్యప్రదర్శన

**రవీంద్రభారతి, ఆగస్టు 29 ప్రభాతవార్త :**
భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, శంకరానంద కళాక్షేత్రం, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తామ్రపాత్ర లైవ్ అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన జరుగనుంది. ఈ నెల 31 శనివారం రాత్రి 7గంటల నుండి ప్రారంభమయ్యే ఈ సాంస్కృతిక వేడుకలో భారత దేశంలోని అయిదురుగు ప్రఖ్యాత నృత్యగురువు, నాట్యకళాకారులు ఆనంద శంకర జయంత్, అనుపమ కైలాష్, దీపికా రెడ్డి, గోపికావర్మ, వైభవ్ అరేకర్‌లు తమ నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ప్రముఖంగా భరతనాట్యం, కూచిపూడి, మోహినియాట్టం వంటి ప్రఖ్యాత శాస్త్రీయ నృత్యశైలిలో ప్రదర్శించనున్న ఈ ప్రతిష్టాత్మక నృత్యాన్ని తిలకించేందుకు అధికసంఖ్యలో సంగీత, నృత్యప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ప్రదర్శనను ఆసాంతం తిలకించి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### విద్యుత్ సమస్యలపై సంక్షేమ సంఘం నాయకుల ఫిర్యాదు


శ్రీనాథ్ రెడ్డిని సన్మానిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త**
గత కొద్ది కాలంగా జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో తలెత్తిన విద్యుత్ సమస్యలపై పలు సంక్షేమ సంఘం నాయకులు పిర్యాదు చేసిన వెంటనే వెన్నెలగడ్డ డిఈ శ్రీనాథ్ రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించినందుకు గాను వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు గురువారం వారి ఆఫీస్‌లో శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ఏఈ జ్ఞానేశ్వర్, లైన్‌మెన్ రవీందర్, ఎం.ఎన్.రెడ్డి కాలనీ ఫేస్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంపత్‌గౌడ్, జనరల్ సెక్రటరీ రవీందర్ గౌడ్, కోశాధికారి కరుణాకర్‌రెడ్డి, బాపిరెడ్డి, పాండు, సత్తయ్య గౌడ్, నవీన్‌రెడ్డి, గోపి, రంగారెడ్డి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

### డెంగ్యూ వంటిప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా చర్యలు


ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాల మేరకు చెత్తాచెదారాన్ని తొలగించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఆగస్టు 29ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశాలమేరకు డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రభలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నేత ముఠానరేశ్, పూర్వ డివిజన్ అధ్యక్షుడు ముఠా నరేశ్ అన్నారు. ఇందులో భాగంగా గురువారం ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని సుదర్శన్ 25ఎంఎం థియేటర్ పరిసర ప్రాంతాలలో దుర్గందంగా మారిన ప్రాంతంలో జిహెచ్ఎంసి సానిటేషన్ సిబ్బంది సహకారంతో పెద్దఎత్తున చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక ప్రజలు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తినా 7032225224కు సంప్రదించాలని కోరారు. డివిజన్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు డివిజన్‌లో సానిటేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## పిక్‌ప్యాకెటర్ అరెస్టు

**కంటోన్మెంట్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఫోన్‌లో మాట్లాడుకుంటూ నడుచుకుంటున్న వెళ్తున్న వ్యక్తి చేతిలో నుంచి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళ్లి సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన సంఘటన కార్ఖాన పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి చంద్రగిరి కాలనీకి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి బుధవారం రాత్రి నడుచుకుంటూ జెబిఎస్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి శ్రీధర్ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కార్ఖాన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక బోనాలు


లష్కర్ బోనాల అవార్డును అందజేస్తున్న వేణుమాధవశర్మ, లక్ష్మి, దైవజ్ఞశర్మ తదితర అతిథులు

**నాంపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజలు అనాదికాలం నుండి ఎంతో భక్తిశ్రద్ధలతో సమైక్యం ఐకమత్యంతో జరుపుకొనే బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీమహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుమాధవశర్మ అన్నారు. సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ బోనాల పండుగను తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆషాఢమాసం, మొత్తం రాష్ట్రవ్యాప్తంగా శ్రావణమాసంలో మహిళామణులు అమ్మవారిని ఘనంగా పూజించి బోనం సమర్పించి తమ మొక్కులను తీర్చుకొని యావత్ కుటుంబం ఆయుఃఆరోగ్యాలతో, సిరిసంపదలతో క్షేమ సంతోషాలతో విరసిల్లాలని అమ్మవారికి కొలుస్తారని, ఉజ్వల సంస్థ విలక్షణమైన లష్కర్ బోనాల అవార్డులను ఏర్పాటుచేసి అమ్మవారికృపకు పాత్రులు చేయడం హర్షదాయకమని నిర్వాహకులు నూనె సత్యనారాయణయాదవ్ (సతీష్), ఎం.లక్ష్మిలకు, అవార్డు గ్రహీతలకు శుభాశీస్సులు తెలిపారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఉజ్వల సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా నిర్వహించిన లష్కర్ బోనాల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుమాధవశర్మ, సభాధ్యక్షుడు దైవజ్ఞశర్మ, శివనరసింహస్వామి, విశిష్ట అతిథులు బాల్‌రాజ్ ముదిరాజ్, గౌతమ్, సుభాషిని మాతాజీ, సీనియర్ పాత్రికేయుడు సతీష్, సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మిలతో కలిసి ఎంపికచేసిన వివిధ బెస్ట్‌బోనం, పోతరాజు, ఫలహారబండి అంశాలకు చెందిన వారికి లష్కర్ బోనాల అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పోతరాజు విన్యాసాలు ప్రేక్షకులకు గగుర్గొల్పి మంత్రముగ్ధులను చేశాయి.

## దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలి : టిఎన్‌జిఓ


టిఎన్‌జిఒ సెంట్రల్ కమిటికి వినతిపత్రాలు అందచేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు29ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌లలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించుటకై జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలపై 2016 సంవత్సరం నుంచి ధరఖాస్తు చేసుకుని ఉన్న వారికిగత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు రాలేదని తాము డిగ్రీ, పిజి చదువులు పూర్తి చేసుకుని గత 8ఏళ్లుగా కుటుంబానికి భారంగా మారుతుందన్నారు. జిల్లా పరిషత్ వివిధ కార్యాలయాలలో కారుణ్య నియామకాలకు కల్పిస్తూ అవకాశం కల్పించాలని చెప్పి జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ హోదాలలో పని చేస్తూ చనిపోయిన కుటుంబాలకు సంబంధించిన వారి పిల్లలు కారుణ్య నియామకాల కోసం తెలంగాణ నాన్‌గజిటెడ్ కేంద్ర సంఘంఅధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరివెంకటేశ్వర్లుకు వినతిపత్రాలను అందచేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు వీలైనంత కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం జి.ఓనెంబర్79, 2023 జూలై 20వ తేదిన ద్వారా ఆఫీసు సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా ఆప్‌గ్రేడ్‌గా, నియామకాల బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించడం జరిగిందన్నారు. అయితే మిగతా అన్ని డిపార్ట్‌మెంట్ కారుణ్య నియామకాల కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఉద్యోగాలను ఇవ్వాలన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : డిసిపి ఇందిరా


డీసీపీ ఇందిరాను కలిసి సత్కరిస్తున్న తెలంగాణ పోలీసు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు ఎం.రవీంద్ర కుమార్

**చిక్కడపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త:**
శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, రాచకొండ పోలీసు కమిషనరేట్(అడ్మిన్) పి.ఇందిరా అన్నారు, గురువారం ఎపి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర నేత, బీసీ రాజ్యాధికార సమితి ఉపాధ్యక్షుడు, తెలంగాణ పోలీసు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.రవీంద్ర కుమార్ నేతృత్వంలో ప్రతినిధి బృందం ఇందిరాను కలిసి నూతనంగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా సత్కరించి అభినందించారు. పోలీసులు తీసుకునే ఎటువంటి కార్యక్రమాలకు తోడ్పాటును అందించాలన్నారు.

### వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటి ప్రతినిధులు

**మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటి ప్రతినిధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

### గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి


పూజ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.వెంకటేష్

**చార్మినార్, ఆగస్టు 29 ప్రభాతవార్త :**
పాతబస్తీ లాల్‌దర్వాజ శ్రీ ఓంకార గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్న వినాయక మండపం కోసం గురు వారం సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా కర్ర పూజ నిర్వహించి మండప నిర్మాణ పనులను చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గణేష్ ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి చైర్మన్ కె.సంజావ, ప్రెసిడెంట్ ఫంకజ్ షిండే, ప్రతినిధులు శ్రీ కాంత్ ముదిరాజ్, కె.దీపక్, రాహుల్, అంకిత్, చంటి, ప్రవేశ్, భాగవత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### మంచిరేవులలో సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభం


నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవులలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ.

**నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో గురువారం రూ.50.లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, స్మశాన వాటికలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటివి ఏర్పాటు చేశామన్నారు. చేసిది చెప్పడం, చెప్పింది చేయడం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల నైజామని తెలిపారు. మంచిరేవుల గ్రామంలో గతంలో తీవ్రమైన మంచినీటి సమస్య ఉండేదని, ఇప్పుడా సమస్యను పూర్తిగా తొలగించడం జరిగిందన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల, మత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులు పరిష్కరించడమే ధ్యేయంగా నిత్యం పని చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లంకల పద్మ వీరారెడ్డి, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతం

**చార్మినార్, ఆగస్టు 29 ప్రభాతవార్త :**
పాతబస్తీ మీరాలంమండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో ఈ నెల 30వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నామని మందిరం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య తెలిలిపారు. శ్రావణ మాసం ద్వాదశి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని .యప్రదం చేయాలని ఆయన కోరారు.

### ముస్లిం వ్యతిరేక విధానంలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు

**చార్మినార్, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ముస్లిం వ్యతిరేక విధానంలో భాగమే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు – 2024 అని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. పాతబస్తీలో గురువారం ఆయన మాట్లాడుతూ. ముస్లింలను సామాజిక, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా అధోగతి వైపు పెట్టడానికి ఒక ప్రథకం ప్రకారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుత సవరణ వక్ఫ్ బిల్లు ఆస్తుల్ని కబళించటానికి వ్యూహాత్మకంగా వేసిన మరో అడుగని ఆయన తెలియజేశారు. షరీఆత్ ప్రకారం ఎవరైనా ఒకసారి తమ ఆస్తిని వక్ఫ్ చేశారంటే ,ఇక అందులో జోక్యం చేసుకునే హక్కు అధికారం ఎవరికి ఉండదని వక్ఫ్ సవవణ బిల్లు వల్ల ముస్లింలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : దేవర వంశీ


తాళ్లగడ్డలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న దేవర వంశీ.

**మెహిదీపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని బిజెపి యువమోర్చ నాయకులు దేవర వంశీ తెలిపారు. బస్తీలు, కాలనీలలో నెలకొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. గురువారం గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని తాళ్లగడ్డతో పాటు పలు బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటిలో కలుషిత జలాలు వస్తుండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన దేవర వంశీ జలమండలి మేనేజర్ సుబ్రహమణ్యం, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. గణేష్, దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు త్వరలో ప్రారంభం అవుతుండడంతో అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. బస్తీలు, కాలనీలలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంటన స్థానికులు ఉన్నారు.

## బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సంతోష్ కుమార్

**నిజాంపేట్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బాచుపల్లికి చెందిన బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గజ్జెల్లి సంతోష్ కుమార్‌ని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించారు. గురువారం బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ సంతోష్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.


బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీధర్ చేతలు మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న సంతోష్ కుమార్

## కులగణనపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

**-గోడ ప్రతులను ఆవిష్కరించిన జాజుల శ్రీనివాస్‌గౌడ్**


కలెక్టర్ కార్యాలయాల ముట్టడి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**ముషీరాబాద్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్షం మరియు బీసీ సంఘాలతో ముఖ్యమంత్రి వెంటనే సమావేశం ఏర్పాటుచేసి, రోడ్ మ్యాప్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సెప్టెంబర్ 2న జరబోయే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి వాల్ పోస్టర్‌ను ఆయన వివిధ కుల సంఘాల నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ త్వరలోనే బీసీ కమీషన్ ఏర్పాటుచేసి, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటం అభినందనీయమే కానీ, సీఎం మాటల్లో స్పష్టత లేదని అన్నారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించాలని బీసీ సంక్షేమ సంఘం నిర్ణయించిందని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సమస్త బీసీ సమాజం ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయాల ముట్టడి తరువాత లక్ష మందితో ఛలో హైదరాబాద్ పిలుపుతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, బీసీ నేతలు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యాంకుర్మ, గొడుగు మహేష్‌యాదవ్, మాదేశి రాజేందర్, గూడూరు భాస్కర్, దేవిక, వాణి, భరత్ పాల్గొన్నారు.

## వెన్ను, మెడ నొప్పికి డి విటమిన్ లోపమే కారణం

**-ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు, ప్రొఫెసర్, మేజర్ భక్తియార్ చౌదరి..**

**పంజగుట్ట, ఆగస్టు 29 (ప్రభాతవార్త):**
ప్రపంచంలో లక్షలాది మంది తమ జీవితంలో ఏదో ఒక సమయంలో వెన్ను, మెడ నొప్పితో బాధపడుతూ ఉంటారని, దీనికి విటమిన్ డీ లోపమే కారణమని ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్, ప్రొఫెసర్ మేజర్ డాక్టర్ ఎస్.భక్తియార్ చౌదరి తెలిపారు. అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల పిల్లలు, గృహిణులు, సాయుధ దళాల సిబ్బంది, వివిధ వృత్తులలో ఉన్న రోగులకు నలభై ఏళ్ళు చికిత్స అందించిన అనుభవంతో పదివేల మందిన అనవసర చికిత్సలన నుంచి రక్షించామని తెలిపారు. ముందుగా జోక్యం చేసుకోవడం, నివారణా వ్యూహాల ద్వారా శస్త్ర చికిత్సలను నిరోధించవచ్చని తెలిపారు. తాము చేసిన తాజా అధ్యయనం అంతర్జాతీయంగా ప్రచురణలో ఉందన్నారు. మానవ శరీర మెకానిక్స్ కొన్ని హాని కలిగించే ప్రాంతాలను వ్యాధికి వదిలివేయబడుతుందని తెలిపారు. అంతర్గత పర్యావరణం, బాహ్య వాతావరణం వంటి జీవన శైలి కారకాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన విటమిన్ డీ లోపం, ఇతర సూక్ష్మ పోషకాలను కలిగిస్తాయని తెలిపారు. ఒకసారి ఒక వ్యక్తి తీవ్ర లోపానికి గురైతే ఆ వ్యక్తి జీవితాంతం ఆ లోపంతో ఉండే అవకాశం ఉందని తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు. మానవ వెన్నుముక గురుత్వాకర్షణ కేంద్రానికి ఆటంకం కలిగించే ఏదైనా చర్య తీవ్రమైన లేదా దీర్ఘకాలిక వెన్ను లేదా మెడనొప్పిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కదలికను నియంత్రించే ఏదైనా కారణం ఎగువ అవయవాల రోజువారీ కార్యకలాపాల సమయంలో స్పైన్‌పై విపరీతమైన ఒత్తిడి కలిగిస్తుందన్నారు.. జీవితంలో కొన్ని అలవాట్లను అధిగమించడం ద్వారా అధగమించవచ్చని, ప్రధానంగా సమయానికి ఆహారం తీసుకోవడం, సూర్యరశ్మి శరీరానికి తగలేవిధంగా చూసుకోవాలన్నారు. వెన్ను నొప్పి సాంప్రదాయ పద్దతుల ద్వారానే తగ్గించుకోవాలే కానీ శస్త్ర చికిత్స ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జే.విజయారావు, ఇంటీరియర్ డిజైనర్ శాంతి వాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణాదక్షుడిగా మన్ననలు పొందిన డివి.రాజు

**చిక్కడపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఇస్రో శాస్త్రవేత్తగా దేశం గర్వించదగ్గ వ్యక్తిగా ఉన్నా కూడా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణాదక్షుడిగా పేరును సంపాదించిన వ్యక్తి డివి.రాజు అని ప్రసార కళాప్రవీణ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. గురువారం కాకినాడ మ్యూజికల్ గ్రూప్(కెఎంజి) ఆధ్వర్యంలో 'సినీ దర్శకుల స్వరమాలిక' పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహకులు జిఎస్‌జె.కుమార్, కార్యదర్శి టి.రవికుమారి ఆధ్వర్యంలో జరిగింది. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ పూర్వ డిప్యూటీ డైరెక్టర్, కెఎంజి అధ్యక్షుడు దండు విశ్వేశ్వర రాజు స్మృత్యర్థం జరిగిన ఈ కార్యక్రమంలో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ డిప్యూటీ డైరెక్టర్(మేనేజ్‌మెంట్ సిస్టమ్స్) డాక్టర్ కెవి.రమణ, గ్రూప్ డైరెక్టర్(ఎస్ అండ్ ఏఎస్‌జి) కె.కోటేశ్వర రావు, గ్రూప్ డైరెక్టర్ డి.శంతన్‌కుమార్(కన్‌స్ట్రక్షన్ మెయిటెనెన్స్(గ్రూప్), పూర్వ గ్రూప్ హెడ్, ఇస్రో విశ్రాంత ఎంప్లాయస్ ఫోరం అధ్యక్షుడు ఎన్ఎస్.పరంధామన్, ఇస్రో పూర్వ శాస్త్రవేత్త ఎం.సదాశివవరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రణీత్ పోలమూరి, ఎ.బ్రహ్మానందం, ఎ.రవికుమారి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు జిఎజె.కుమార్, అమర్‌నాథ్ దేశ్‌పాండే, బి.వెంకన్నబాబు, బి.సీతారామరాజు(బాబీ), మహ్మద్ ఓమర్, అంతర్జాతీయ గాయనీ బి.శారదాసాయి, జాతీయ గాయనీ హెచ్‌వీఎస్.రామలక్ష్మి, ఎం.రమా కామేశ్వరి, సిహెచ్.అలేఖ్య, బి.ఉమాసింధు, బి.తేజస్వినీ తదితరులు అద్భుతంగా గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు.


ఇస్రో శాస్త్రవేత్త డివి.రాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఓలేటి పార్వతీశం, ఇస్రో ఉన్నతాధికారులు డాక్టర్ కె.వి.రమణ, కె.కోటేశ్వరరావు, డి.శంకన్‌కుమార్, జిఎస్‌జె.కుమార్, టి.రవికుమారి తదితరులు

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన డిసిపి

**-పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశం**



**అత్తాపూర్ ఆగస్టు29, ప్రభాతవార్త :**
గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డిసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ పరిధిలోని పత్తికుంట, పల్లెచెరువులలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను డిసి రవి కుమార్, ఎసిపి శ్రీనివాస్, మైలర్‌దేవ్‌పల్లి సిఐ నరేందర్, రాజేంద్రనగర్ సిఐ క్యాస్ట్రో, వివిధ పార్టీల నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గణేష్ మండపాలలో ఏర్పాటు చేసుకున్న వినాయకులను నిమజ్జనం చేయడానికి పత్తి కుంట, పల్లేచెరువు ఎక్కువగా నిమజ్జనానికి చేస్తారని కావున పకడ్బందీగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిహెచ్ఎంసి ,కరెంటు, సంబంధించిన అధికారులు కూడా దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేయాలని డిసిని కోరారు. అలాగే వీధిలైట్లు ,వేదికలు ,మంచినీళ్లు, మెడికల్ కు సంబంధించిన స్టాల్స్ అన్ని ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి వచ్చే భక్తులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. అనంతరం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ కో కన్వీనర్ బోక్కా బాల్ రెడ్డి మాట్లాడుతూ... భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక మండపాల ఏర్పాటుకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే ఉత్సవ సమితి తెలియజేయాలని ఎలాంటి ఇబ్బందులు ఉన్న పోలీసు ,జిహెచ్ఎంసి ,ఇతర అధికారులతో మాట్లాడి ఇబ్బందులను తొలగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మల్లారెడ్డి, కొముయ్య, మల్లేష్ యాదవ్, సత్యనారాయణ, ముదిరాజ్, బాబు రావు, విజయ్, రామేశ్వరరావు, అడికే జనార్ధన్, రావుల భాస్కర్, శాస్త్రి పురం నిఖిలేష్, సచిన్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

### తొలిదశ ఉద్యమకారుడు పెంటారెడ్డికి ఘన నివాళి


పెంటారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ నేతలు

**మెహిదీపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త :** తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు బర్రెంకబావి పెంటారెడ్డి దశదిన కర్మను గురువారం పి.ఆర్.ప్యాలెస్‌లో కుటుంబ సభ్యులు రాజారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో పాటు తెలంగాణ తొలిదశ ఉద్యమకారులతో పాటు పలువురు స్థానిక నేతలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి, పలువురు నాయకులు ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. అనంతరం తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పెంటారెడ్డి తెలంగాణ కోసం ఆయన పోరాడిన తీరును స్మరించుకున్నారు. నివాళులర్పించిన వారిలో రాజారెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటరమణలు ఉన్నారు.

## మాభూములు మాకు ఇప్పించండి

### ప్రభుత్వానికి కొండకల్ తండా వాసులు విజ్ఞప్తి


ప్రెస్‌క్లబ్‌లో తమపట్టాలను చూపుతున్న కొండకల్ తండా వాసులు

**హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త:**
తాతముత్తాల నుంచి వస్తున్న తమ స్థలాలను అక్రమంగా స్వాధీనం చేసుకోవడమే కాక తమను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమ భూములు ఇప్పించాలని కొండకల్ తండా వాసులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తండావాసులు రవి, లక్ష్మణ్, చందర్‌లు మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో ఓప్రముఖ నిర్మాణ సంస్థ కబ్జా చేయాలని ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మంత్రులను అడ్డం పెట్టుకుని కబ్జాకు ప్రయత్నాలు ప్రారంభించారని చెప్పారు. ప్రభుత్వం మారిన అనంతరం తమకు న్యాయం జరుగుతుందని భావించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే తమపైనే అక్రమ కేసులు బనాయిస్తూ చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతునానరని కన్నీరుమున్నీరయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఓకీలక మంత్రి తమకు అండగా ఉన్నారని మీరు ఏం చేయలేరని సదరు సంస్థ ప్రతినిధులు భయపెడుతున్నారని చెప్పారు. కావున సిఎం రెవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పేదలను వేధిస్తున్న బడాబాబులకు బుద్దిచెప్పాలని విజ్ఞప్తి చేశారు.

## హైడ్రా చర్యలపై హర్షం వ్యక్తం చేసిన టి-జెఎసి

**సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన హైడ్రా కార్యక్రమం పట్ల తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టి-జెఎసి) హర్షం వ్యక్తం చేసింది. హైడ్రా కార్యక్రమాన్ని ప్రజలందరూ అమోదిస్తున్నారని, హైడ్రాకు సంపూర్ణ అధికారాలు ఇవ్వడం ఎంతో అవసరమని, అందరిని సమదృష్టితో చూస్తామని సాహసోపేతమైన చర్యని టి-జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం చెప్పారు. చెరువుల్లో కట్టిన ఇండ్లు భవిష్యత్తులో మునిగిపోతే బాధ్యులు ఎవరని, స్వార్థం విడనాడి నేతలందరూ మద్దతు పలకాలని, ప్రభుత్వ పబ్లిక్ పార్కులను కూడా కాపాడాలని ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందారెడ్డి, జలగం వెంగళరావు పేరిట పార్కులలో కట్టిన భవనాలపై ప్రభుత్వ దృష్టి పెట్టాలని, హైడ్రాను తెలంగాణ రాష్ట్ర మంతట విస్తరింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## కాంగ్రెస్ పార్టీని ఢీటుగా ఎదుర్కొన్న వ్యక్తి నందమూరి హరికృష్ణ

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**



హరికృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

**ముషీరాబాద్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త:** సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఢీటుగా ఎదుర్కొన్న వ్యక్తి నందమూరి హరికృష్ణ అని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా కొనియాడారు. గురువారం హరికృష్ణ వర్ధంతి సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో హరికృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ 1996 నుండి 1999 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన హరికృష్ణ రవాణాశాఖా మంత్రిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు సేవలు అందించారని గుర్తుచేశారు. 2008లో తెలుగుదేశం పార్టీ తరఫున రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన హరికృష్ణ ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అత్యంత సన్నిహితుడని అన్నారు. హరి కృష్ణ ఆశయాలతో ముందుకు సాగుతూ టీడీపీని బలోపేతం చేయ టమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, పెద్దోజు రవీంద్రాచారి, జి.యాదగిరిరావు, యువత మేడిపల్లి శ్యాం సుందర్, ఎం.రాజు, డి.చంద్రమోహన్, ఓ.వెంకటేష్ చౌదరి, భానుప్రకాష్, కిరణ్, సత్యనారాయణ, భవాని శ్రీనివాస్, వై.ఎల్.నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వేకు అందరూ సహకరించాలి : డిసి సమ్మయ్య



వివిధ పార్టీల నేతలతో సమావేశమైన జోనల్ కమిషనర్ సమ్మయ్య,కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్,ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను సరి చేసుకునేందుకు,ఓటర్ల జాబితాలో ఓటర్ల నమోదును చేయించుకునేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రజలు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్ఎంసి బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి.సమ్మయ్య తెలిపారు. గురువారం సర్కిల్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నేతలతో, కారో ్పరేటర్లతో అయన సమావేశమైయ్యారు. ఆయా ప్రాంతాల్లో బి.ఎల్.ఓ.అధికారులు ఇంటింటికి సర్వే చేయుటకు వస్తారని, వారికి ఓటర్లు సహాయ సహకారాలు అందించి పూర్తి వివరాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, వివిధ పార్టీల నాయకులు దయానంద్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పూజలు



తిరుమలగిరి శ్రీశ్రీశ్రీ స్వయంభు వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఆగస్టు 29 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 7వ వార్డు తిరుమలగిరిలో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ స్వయంభు వీరభద్ర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళీ ముదిరాజ్, వీరేశం, సి.హెచ్.రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అనునిత్యం ప్రజాసేవలో ఎమ్మెల్యే వివేకానంద..



ఎమ్మెల్యే వివేకానందను సన్మానిస్తున్న ప్రజలు

**నిజాంపేట్, ఆగస్ట్ 29, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సమాన్య ప్రజలు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే వివేకా నంద దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు

**చిక్కడపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగసప్తస్వరమ్ నిర్వహణలో తిరుమల గ్రూప్, సీల్‌వెల్ కార్పొరేషన్ సౌజన్యంతో సెప్టెంబరు 3న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో విఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు నిర్వాహకురాలు విఎస్.రాజ్యలక్ష్మి వివరించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి హాజరయ్యే కార్యక్రమానికి తిరుమల గ్రూప్ ఛైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అధ్యక్షత వహిస్తారు. ఎలక్ట్రానిక్ సామాజిక మాధ్య జర్నలిస్టులకు రాగసప్తస్వరమ్ సంస్థతో ప్రారంభం నుంచి అనుబంధం ఉన్న ప్రింట్ మీడియా వారికి, ప్రముఖ సాంస్కృతిక సంస్థల వ్యవస్థాపకులకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు నన్నపనేని రాజకుమారి సభను ప్రారంభిస్తారని, బండారు సుబ్బారావు, వంశీ రామరాజు, కాంగ్రెస్ నాయకురాలు శ్రీమణి, విద్యావేత్తలు సర్వమంగళగౌరి అతిథులుగా పాల్గొంటారు. అక్కినేని సినిమాలలోని పాటలను బాలకామేశ్వరరావు, ఆమని బృందం ఆలపిస్తారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**- బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ లతా ప్రేమ్‌గౌడ్**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో "డెంగ్యూ" వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో

**నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** దోమల ద్వారా వేగంగా విస్తరిస్తున్న "డెంగ్యూ" వ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం కార్పోరేషన్ కార్యాలయంలో దోమల నివారణ, డెంగ్యూ వ్యాధిపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ దోమల వల్లనే అన్ని రకాల విష జ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, ఫ్లూ జ్వరాలన్నీ దోమల కాటు వల్లనే సోకుతాయని, ఈ దోమల నిర్మూలన కోసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మన ఇళ్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. కనీసం వారానికి ఒకసారైనా ఇంటిలో ఉన్న పైపులు, డబ్బాలు, టైర్లు, పూలతొట్లు ఇలాంటి వాటిని శుభ్రం చేయాలన్నారు. మురుగు కాలువలు, కుంటలు, చెరువులలో0 దోమల లార్వాలను తినే గాంబూజియా చేపలను వదిలి పెట్టాలని, నెలకు రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. రోగాలు వచ్చాక ఇబ్బందులు పడడం కన్నా, అవి రాకుండా జాగ్రత్తలు పాటించడం మేలన్నారు. ప్రజలు తమ ఇళ్లల్లో దోమ తెరలు వాడు కోవాలని, దోమల కాటు నుంచి రక్షించుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులుగా దోమలు మారాయని, ఈ దోమల నిర్మూలనకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ, శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ శరత్‌చంద్ర, శానిటేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దర్గా కలిస్కాన్‌లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు "డెంగ్యూ" వ్యాధి నివారణోపాయాలు,దోమల నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# గణేశ్ నిమజ్జనోత్సవాలు పకడ్బందీగా చేపడుతున్నాం : మేయర్

**శేరిలింగంపల్లి, అగస్టు 29 ప్రభాతవార్త**

గణేశ్ ఉత్సవాలలో భాగంగా నిమజ్జనోత్సవానికి అత్యంత పగడ్బందీగా ఏర్పాటు చేపట్టాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. అందుకు సంబందించి ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని ఏలాంటి పొరపాట్లు,అసౌకరాయలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాలలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి మేయర్ విజయలక్ష్మీ సుడిగాలి పర్యటన చేశారు. అధికారుల బృందంతో కలిసి మల్కం చెరువు,గోపిచెరువు,నల్లగండ్ల చెరువు,రాయసముద్రం చెరువు,సాకిచెరువు,గంగారం చెరువు, గౌతమ్ బేబి పాండ్, కడియం కుంట, దుర్గం చెరువుతో పాటు ప్రధాన,అంతర్గత రహదారులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్బంగా మేయర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. ఆయా విభాగాల నడుమ ఏలాంటి సమన్వయ లోపం లేకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ముందస్తుగా తొలగించి సంసిద్దం చేయాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే ప్రాంతాలలో రహదారులను యుద్ద ప్రాతిపదికన మరామత్తులు చేయాలని,పాండ్ల వద్ద విధ్యుత్ దీపాలు, శానిటేషన్ సహా అనుబంధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జోన్‌లో పారిశుద్యం మెుగుకు నూతనంగా చేపడుతున్న చర్యలను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీలు, ఇంజనీరింగ్,పారిశుద్యం,పట్టణ ప్రణాళిక,ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, పుష్పనగేశ్ యాదవ్,మంజుల రెడ్డి,పూజిత,హమీద్‌పటేల్ ఉన్నారు.



శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన మేయర్ విజయలక్ష్మీ

# దుండిగల్ పురపాలిక అభివృద్ధికి సహకరిస్తా : ఎంపి ఈటల

**దుండిగల్, ఆగస్టు 29 ప్రభాతవార్త:**

దుండిగల్ పురపాలిక సంఘం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఛైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ అధ్యక్షతన జరిగిన ఈసమావేశానికి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించడంతో పాటు కౌన్సిల్ సభ్యులు తెలిపిన సమస్యలను ఛైర్‌పర్సన్ సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పురపాలిక పరిధిలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థకు రూ,4.46కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ,10.93కోట్లు, గ్రేవ్‌యార్డులకు రూ,1.82కోట్లు, కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణానికి రూ,1.40కోట్లు మొత్తంగా రూ,18కోట్ల రూపాయలతో చేపట్టనున్న పనులకు ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గ్రామకంఠంలో ఉన్నటువంటి ఇండ్లకు తహాసీల్దార్ పరిశీలించి గ్రామకంఠం ధృవ పత్రాలను జారీ చేయాలని కౌన్సిల్ సభ్యులు తహాసీల్దార్‌ను కోరారు. ఈసందర్భంగా ఎంపి ఈటల మాట్లాడుతూ దుండిగల్ పురపాలిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కౌన్సిల్ సభ్యులందరూ కలిసికట్టుగా అభివృద్ధిని వేగవంతం చేయాలని సూచించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి త్వరితగతిన ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించాలన్నారు. పురపాలికను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ పద్మారావు, కమీషనర్ సత్యనారాయణరావు, తహాసీల్దార్ సయ్యద్ మతీన్, మేనేజర్ సునంద, ఏఈ సురేందర్ నాయక్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వివిధ విభాల అధికారులు పాల్గొన్నారు.



ఎంపి రాజేందర్‌ను సత్కరిస్తున్న పాలకవర్గం

# సినీరంగ విజ్ఞానఘని ఎస్వీరామారావు : డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలుగు సినీరంగంపై మొదలు నుండి నేటివరకు సంపూర్ణ అవగాహన, సమగ్ర సమాచారంతో అడిగిందే తడవుగా ఆశువుగా చెప్పగల తెలుగునాట ఏకైక సినీరంగ విజ్ఞానఘని, నటుడు, రచయిత, దర్శకుడు ఎస్.వి.రామారావు అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. సామాన్యం 60ఏళ్లు దాటితే పెద్దమనిషి, 70కి ముసలివాడు, 80కి ఎందోనని, 90దాటితే ఎలాగో అనుకొంటామని, ఇక ఆతర్వాత ఇంకేమనుకోవాలో తెలియక భగవంతుడి దయ లీల అనుగ్రహమనుకొంటాం కానీ 85నిండినా నవయువకుడుగా తన ప్రస్థానాన్ని, ప్రాముఖ్యతను, ప్రతిభను చాటుకొంటున్న ఎస్వీరామారావు మహోన్నత వ్యక్తిత్వం ఎనలేనిది, మరెక్కడ కనలేనిది, సామాన్యంకాదు ఏమనుకోవాలో అర్థంకావడంలేదని చమత్కరించారు. తన పుట్టినరోజున ప్రాముఖ్యులైన వ్యాఖ్యాతలను సత్కరించుకోవాలని ఆలోచనరావడం సలక్షణం, ఎంతో ముదావహమన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. బి.వి.పట్టాభిరామ్, లంక లక్ష్మీనారాయణ, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ప్రముఖ వ్యాఖ్యాతలు ఆశాలత, ఎ.మురళీకృష్ణ, ఎం.దక్షిణామూర్తి, డా. వి.వి.రామారావుల వాక్‌ధాటి, పరిజ్ఞానం, ప్రతిభను విశదీకరించి కొనియాడి 85వ జన్మదినోత్సవాన్ని జరుపుకొంటున్న ఎస్.వి.రామారావు దంపతులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.



సన్మానితులైన ఎస్వీరామారావు దంపతులు, వ్యాఖ్యాతలతో రమణాచారి, పట్టాభిరామ్, లంక, రఘురామ్ తదితర అతిథులు

## పంకజ్‌కు ఘన స్వాగతం పలికిన కంటోన్మెంట్ బిజెపి నేతలు

**కంటోన్మెంట్,ఆగస్టు 29 ప్రభాతవార్త:** హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ సభ్యుడు, విశ్వహిందూపరిషత్ ప్రధాన కార్యదర్శి పంకజ్ జీ తెలిపారు. పికెట్‌లోని బిజెపి నేత నాగభూషణ్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో కంటోన్మెంట్‌కు చెందిన బిజెపి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్య లో తరలి వచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు. పంకజ్‌కు జై శ్రీరామ్ నినాదా లతో స్వాగతం పలికారు. అనంతరం తమిళనాడులోని రాముల వారి విగ్రహాల తయారీని పరిశీలించేందుకు కంటోన్మెంట్‌కు చెందిన బిజెపి నేత నాగభూషణ్ రెడ్డితో తరలివెళ్ళారు.

# అర్హులందరికీ ఉచిత విద్యుత్,నీటి సరఫరాను అందించాలి

## -సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని



బేగంపేట డివిజన్ జవహర్‌జనతా,భర్తన్ కాంపౌండ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

**బేగంపేట ఆగస్టు 29,ప్రభాతవార్త**

బిల్లులు చెల్లించాలని పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బేగంపేట డివిజన్ పరిధిలోని జవహర్ జనతా,బర్తన్ కాంపౌండ్ బస్తీలలో వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. జీరో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని,నేడు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదని ఈ సందర్బంగా పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. తెలంగాణా ప్రభుత్వం హయాంలో ఉచితంగా నీటి సరఫరా చేయగా ఇప్పుడు నల్లా బిల్లులు చెల్లించాలని అధికారులు వత్తిడి చేస్తున్నారని,లేకుంటే నీటి సరఫరా నిలిపివేస్తామంటున్నారని ఫిర్యాదు చేసారు. ఎవరూ బిల్లులు చెల్లించవద్దంటూ ఎమ్మెల్యే తలసాని మహిళలకు సూచించారు. తమ బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని రోడ్లపైకి మురుగు నీరు చేరి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు ,రోడ్ల నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని అధికార్లను ఆదేశించారు. పలు చోట్ల నీరు కలుషితం అవుతుందని,బస్తీదవాఖానాలో కొన్ని మందులు కొరత ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వెంటనే ఎమ్మెల్యే తలసాని జిల్లా వైద్యశాఖాధికారితో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన మందులను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి, డిసి సమ్మయ్య,జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్,ఏడీఈ దుర్గా ప్రసాద్,వాటర్‌వర్క్స్ జీఎం వినోద్,డీజీఎం అశిష్,శానిటేషన్ డీఈ ధర్మారెడ్డి,స్ట్రీట్‌లైట్స్ ఏఈ భరత్,మాజీ కార్పోరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్,నాయకులు శ్రీహరి,అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, కిషోర్,శేఖర్, ఆంజనేయులు,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC

నిట్ నం & తేది: 10/DB/EE/ కుత్బుల్లాపూర్ సర్కిల్/GHMC/2024-25, తేది: 27.08.2024

పనిపేరు: గణేశ్ నిమజ్జన వేడుక సందర్భంలో ఏర్పాట్లు చేయుట. అంచనా మొత్తం : (రూ.లక్షలలో) : 9.70 లక్షలు. ప్రారంభ తేది మరియు సమయం : 02.09.2024 మ.3.00గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం : 02.09.2024 మ.3.00గం. EE యొక్క పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701365503. హెడ్ డ్రాఫ్ట్స్ మ్యాన్ సెల్ నెం. 7331186855. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,కుత్బుల్లాపూర్ సర్కిల్-25, GHMC.

DIPR.No.3395-PP/CL/Advt/1/2024-25 తేది: 29.08.2024

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC
డివిజన్ నం-19, SLPZ, GHMC, యూసుఫ్‌గూడ, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నెం. 18/EE/DIV-19/SLPZ/GHMC/2024-25, తేది: 29.08.2024

పనుల సంఖ్య: 1 నం.లు. సివిల్ పనులు, అంచనా మొత్తం రూ.లక్షలలో : 7.30, డౌన్‌లోడ్ ప్రారంభ తేది/ముగింపు తేది మరియు సమయము: 30.08.2024న మ.2.00గం.లు, 02.09.2024న మ.2.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు మరియు చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, GHMC, శ్రీ యు.రాజ్‌కుమార్, 99635-50654. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, (SLPZ), GHMC.

DIPR.No.3446-PP/CL/Advt/1/2024-25 తేది: 29.08.2024

**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
RACPC-2, 3వ అంతస్తు, ఎక్సోటికా, హేమాస్ ట్విన్ ట్లిస్, డోర్ నెం.39-11-76/2/1, బిర్లా జంక్షన్, మురళీ నగర్, విశాఖపట్నం - 530 007.

**ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం**

ఋణగ్రహీత(ల) పేరు : ఈర్ని నరసింహ మూర్తి

| రిజిస్ట్రేషన్ నెం. | కంపెనీ / ఫ్యూయల్ | మోడల్/కలర్ | కిలోమీటర్లు | కనీసపు ధర | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| AP 31 DV 7777 | VERNA1.6 CRDI SX (O) BSIV/DIESEL | 2017/POLAR WHITE | 164761 | రూ.4,50,000/- | రూ.45,000/- |

ఇ-వేలం తేది మరియు సమయం : 03-10-2024 మ॥ 03.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 01-10-2024 సా॥ 04.00 గం॥లకు

బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.10,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) కారును "ఎక్కడ ఎలా వున్నది అక్కడ" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 5) తేది.01-09-2024 నుండి 01-10-2024 వరకు బ్యాంక్ పనివేళలలో ప్లాట్ నెం.218, రోడ్డు నెం.5, శివ సాయి హైట్స్, గాజులరామారం, హైదరాబాద్ వద్ద తనిఖీ చేసుకోగలరు. వాహనము తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 95532 04444, 80966 61316. 6) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s PSB Alliance యొక్క వెబ్‌పోర్టల్:https://ebkray.in/eauction-psb/bidder-registration, టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 8291220220ను సంప్రదించండి.

తేది : 29-08-2024, ప్రదేశం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, SBI, RACPC-2, విశాఖపట్నం



**PUBLIC NOTICE**

The general public is hereby informed that my client **Sri. Sivakumar Thaliadan Chathu,** S/o Late. K.K. Chathu, aged 64 yrs, resident of House No. 1-30-412, Plot No.70 Part, Padmavathy Colony, Kanajiguda, Trimulgherry P.O, Secunderabd-500015, Telangana State has sold his car. Details of the car is as follows: Hyundai Sonata Gold (Sedan Type), Ebony Black Colour bearing **Registration No. AP09AT0099.** Chassis No.is MALEN4 1BR3M003617 and Engine No. is G4JP267 1040. Registration of the Car is valid up to 30.10.2024. The buyer has not transferred the ownershipon his name till today. My client lodged complaints before SHO, Alwal, Secunderabad; SHO Traffic Police, Alwal; RTO Khairatabad and the Transport Commissioner, Telangana.My client has no responsibility/liability with regard to any incidents on this car. If anyone finds this car, please inform the same on thebelow mentioned address and also to the concerned authorities mentioned in the notice.

**Sd/- G. RAMACHANDER**
**B.Com LLM**
**Advocate**
#10-5-779/36, Tukaramgate
Sec'bad-500017
**Cell No.9849974856**



**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT AND SESSIONS JUDGE-CUM-II ADDL.MSJ-CUM-II ADDL.FAMILY COURT, AT MEDCHAL**
**O.S. No. 593 OF 2022**

BETWEEN :
**Mr. Manikanth Reddy and another.** ...Plaintiffs
AND
**Mr. K. Pandu Ranga Reddy and others.** ...Defendants

To,
**The Defendant No's. 2, 14, 15, 16,17, 23 & 24.**
**2. Mrs. K.Palani Reddy alias Safa Fathima,** W/o Anwar Sadat,D/o K. Pandu Ranga Reddy Aged About : 42 Years, Occ: Household, R/o Flat No. 504, Assra Apartments, AC Guards, Khairathabad, Hyderabad.
**14. Mr. Shiva Ram Prasad,** S/o.Late Basavaiah, Aged About65 Years,Occ: Business, R/o. Plot No. 85,Siddartha Nagar, Hyderabad-38.
**15. Mr.S.Venkateshwar Rao,** S/o. Ananthaiah, Aged About59 Years, Occ: Balaji Residency, Vengal Rao Nagar, Hyderabad.
**16. Mr. T. Hariprasad Rao,** S/o.Late Venkata Ratnam, Aged About 61 years, Occ: Business, R/o.Flat No.205, Dwarakamayee Mansion, Bhaghyanagar Colony, Kukatpally, Hyderabad.-072.
**17. Mrs. J. Treeveni,** W/o. J.S. Rao, Aged About 63 years, Occ: Business, R/o. Plot No.180, Road No.15, Jubilee Hills, Hyderabad-034.
**23. M/S. IOU Projects (India) Pvt.Ltd,** Rep by its Deputy General Manager (Accounts & Admin) Mr. Sri Y. Venkateshwar Rao, S/o. Y. Subbaiah, Aged About Major, R/o. Flat No.605, HMT Hills, Opp: J.N.T.U., Kukatpally, R.R. Dist.
**24. M/S Venkata Krishna Enterprises** Hyderabad, Rep by Manager Finance Mr. K. Subramanyam, S/o.Late K. Kameshwar Rao, Aged About 62 years, R/o.Balanagar, R.R. Dist.

Please take notice that, the Plaintiff has filed the above Suit for Partition and Separate Possession and Consequential Relief to Declare the Sale Deeds against you and others.Hence you are required to appear before the court of the Hon'blell Addl. District and Sessions Judge, Medchal, either in person or through an authorized Advocate, on **11th day of September 2024, at 10.30 a.m.,** as otherwise the said Suit would be adjudicated in accordance with law in your absence.

(By Order of the Hon'ble IIAddl. District and Sessions Judge, Medchal)

**Sd/- For M/s. B. SHASHIDHAR, Advocates COUNSEL FOR THE PLAINTIFF**



కేంద్ర ప్రభుత్వం ఎదుట
సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్
2014 కంపెనీల (ఇన్‌కార్పొరేషన్) నిబంధనలు యొక్క నిబంధన 30 యొక్క ఉప-నిబంధన (5) యొక్క క్లాజ్ (a) మరియు 2013 కంపెనీల చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్(4) యొక్క విషయంలో
మరియు
**ఇనోలా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ విషయంలో**
(CIN-U21009 TS 2023 PTC 170886)
ఫ్లాట్ నం.101 మౌర్యా మార్వెల్ APT ప్లాట్ నం.36, వినాయకనగర్, ఎమ్.ఆర్ గచ్చిబౌలి M రోడ్ దగ్గర, గచ్చిబౌలి, KV రంగారెడ్డి, శేరిలింగంపల్లి, తెలంగాణ-500032 వద్ద దాని నమోదిత కార్యాలయం కలిగి వున్నది.
...పిటిషనర్

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రకటించునది ఏమనగా 2013, కంపెనీల చట్టం యొక్క సెక్షన్ 13 క్రింద ఈ కంపెనీ, కేంద్ర ప్రభుత్వానికి, 24వ జూలై 2024న నిర్వహించబడిన కంపెనీ అసాధారణ జనరల్ సమావేశంలో పాస్ అయిన ప్రత్యేక తీర్మానం యొక్క నిబంధనల ప్రకారం మెమొరాండం ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ ది కంపెనీ యొక్క మార్పు యొక్క నిర్ధారణ కోరుతూ మరియు దాని నమోదిత కార్యాలయాన్ని "స్టేట్ ఆఫ్ తెలంగాణ నుండి స్టేట్ ఆఫ్ ఒడిషా"కు మార్పు సాధ్యమవడానికి వీలుగా దరఖాస్తు పెట్టుకోవడానికి ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించడమైనది.
కంపెనీ యొక్క నమోదిత కార్యాలయం యొక్క ఈ ప్రతిపాదిత మార్పుచే ఏ వ్యక్తి ఎవరి ఆసక్తి ప్రభావితమవుతుందో వారు MCA-21 పోర్టల్ (www.mca.gov.in) పైన ఇన్వెస్టర్ కంప్లైంట్ ఫారం ఫైల్ చేయడం వలనగానీ లేదా కారణం అందచేయడం వలన లేదా అతడు/ఆమె అభ్యంతరాలను అతడు/ఆమె యొక్క ఆసక్తి స్వభావం తెలియజేసే అఫిడవిట్ సపోర్ట్‌తో సహా, వ్యతిరేకత యొక్క ఆధారాలతో సహా రీజినల్ డైరెక్టర్ వారికి సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్- 500068 తెలంగాణకు ఈ నోటీస్ ప్రచురణ తేదీ నుండి పధ్నాలుగు రోజులలోగా అప్లికెంట్ కంపెనీకి కాపీతో దాని నమోదిత కార్యాలయం పైన పేర్కొన్న చిరునామా వద్ద అందచేయవలెను లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించవలెను.

M/s. ఇనోలా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున మరియు కొరకు
సం/-
స్వయం ప్రకాష్
డైరెక్టర్
ప్రదేశం : శేరిలింగంపల్లి
తేది: 30.08.2024 (10061565)



**SUMMONS NOTICE**
**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, AT: RED HILLS, HYDERABAD**
**ABR CF. No. 262of 2024**

Between:
**M/s. Pinninti Chit Fund Private Limited** ...Disputant
AND
**M Vijay Kumar, and others** ...Opponents

To,
**1. M Vijay Kumar,** S/o. Veeraiah, Aged about 36 years, Occ. Business, R/o. H.No. 2-3-603/49/1/22, Patel Nagar, Amberpet, Hyderabad - 500 013.
**2. Dorisetty Shekar,** S/o. Dorishetty Rajappa, Aged about 62 years, Occ. Employee, R/o. H.No. 7-63, Ghandhi Nagar, Kodad (Town), Suryapet (Dist) Telangana - 508 206.
**3. Gajjela Venkat Reddy,** S/o. Shambi Reddy, Aged about 53 years, Occ. SGT (School Teacher), R/o. H.No. 2-91, vepla singaram, Huzurnagar (M), Suryapet (Dist), Telangana - 508 204.
**4. Anup Babu. P,** S/o. Narayana, Aged about 35 years, Occ. Artisan Grade-I, R/o. H.No. 2-3-603/49/1/21, Patel Nagar, Amberpet, Hyderabad - 503 013.
**5. Thorramamidi Mahender,** S/o. Buggappa, Aged about 54 years, Occ. Business, R/o. H.No. 1-05, Chittapur, Thalapalliguda, K.V. Rangareddy, and also R/o. H.No. 5-34/B/F/A, Siripuram Coliny, Ibrahimpatnam, 501 506.
...Opponents

Please take notice that the above disputant has filed the above dispute for recovery of money **Rs.21,99,347/-** from you people. The above dispute is posted for your appearance. So, you are hereby directed to appear on **17.09.2024 at 11:00 AM** before the said Registrar/Arbitrator, failing which the dispute will be disposed of in accordance with law.

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR)

**A. GOVINDA REDDY**
**Advocate**
#1-9-285/1/B, Vidyanagar, Hyderabad - 44
**Mobile No. 9441885086**



**IN THE DEBTS RECOVERY TRIBUNAL- II, TRIVENI COMPLEX ( PALACE HEIGHTS) ABIDS, HYDERABAD - 500001**

**I.A.No. 3217 OF 2023 IN O.A. No. 600 OF 2023**

Between;
**UNION BANK OF INDIA**
Dammaiguda Br. ...APPLICANT
**AND**
**Sri Sanyasi Rajan and Others** ...DEFENDANTS

To,
**Sri. Ranjan Prabhakar,** S/o. Late Sanyasi Rajan, R/o. 2-10-93, EC Nagar, Cherlapally, Hyderabad-500051.

**SUMMONS /SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION**
**SUMMONS**

WHEREAS I.A.No.3217/2023 IN OA 600/2023 was listed before Hon'ble Presiding officer/Registrar on 05-08-2024

Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons / Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 30,92,255.67/-** (Rupees Thirty Lakhs Ninty Two Thousand Two Hundred Fifty Five and Paise Sixty Seven Only).

In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under: -

**(i)** to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted; **(ii)** to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; **(iii)** you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; **(iv)** you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; **(v)** you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, on **07-10-2024** at 10:30 A.M. failing which the application shall be heard and decided in your absence.

**GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBUNAL ON THIS THE 07th DAY OF AUGUST 2024**

**Signature of the authorized officer to issue summons**

**M/s. SANGEETA JAISWAL,** Advocate, # 12-8-170, Mettuguda, Secunderabad.



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II :: HYDERABAD**
**1st Floor, Triveni Complex, Abids, HYDERABAD-500001 (T.S.)**
**O.A.No.108 of 2024**

BETWEEN :
**Union Bank of India** ...Applicant
AND
**M/s. United Labs & Others** ...Defendants

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
**Madithati Indira Reddy,** W/o M.V.R. Prasad Reddy, Female, Aged about 46 years, Occ: Business, Occ:Business, R/o Flat No. 403, D Block, R V Adavita, Near Greek International School, Road No. 6, Habeeb Nagar, Kukatpally, Hyderabad, Telangana - 500018
**(Defendant No. 3)**
**...Defendant No. 3**

Please take summons in the above O.A. No. 108 of 2024filed by the applicant for recovery of debt of **Rs.40,66,074.97 ps.** (Rupees Forty Lakhs Sixty Six Thousand and Seventy Four and Ninety Seven Paise only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vaartha Telugu News Paper", Hyderabad and posted the matter to **13.09.2024.**

In accordance with sub section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:.
(i) to show cause within thirty days of the service summons as to why the reliefs prayed for shouldnot be granted;
(ii)to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing or secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **13.09.2024 at 10:30 a.m.** at Debts Recovery Tribunal-II, 1stFloor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed should not be granted.

Take notice that in case of default the application will be heard and determined in your absence.

(Given under my hand and seal of this Tribunal on this the **29th day of August, 2024**)

**Registrar,**
**Debts Recovery Tribunal-II,**
**Hyderabad.**



**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II :: HYDERABAD**
**1st Floor, Triveni Complex, Abids, HYDERABAD-500001 (T.S.)**
**O.A.No.259 of 2024**

BETWEEN :
**Union Bank of India** ...Applicant
AND
**Mr. Kanchari Praveen & Another** ...Defendants

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
**1. Mr. Kanchari Praveen,** House No. 30-647/2A, Old House No.30-647/2, Road No.1, Plot No.68, Sy No.467 to 469 and 469/1, Part (466), N B Housing Colony, Opp: Krupa Complex, Neredmet, Malkajgiri Mandal & GHMC, Ranga Reddy District, Hyderabad-500056
**2. Mr. KallappaKanchari,** House No. 30-647/2A, Old House No.30-647/2, Road No.1, Plot No.68, Sy No.467 to 469 and 469/1, Part (466), N B Housing Colony, Opp: Krupa Complex, Neredmet, Malkajgiri Mandal & GHMC, Ranga Reddy District, Hyderabad-500056 **...Defendants**

Please take summons in the above O.A. No. 259 of 2024 filed by the applicant for recovery of debt of **Rs.33,09,726.00 ps.** (Rupees Thirty Three Lakh Nine Thousand and Seven Hundred and Twenty Six Only)against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "Vaartha Telugu News Paper", Hyderabad and posted the matter to **13.09.2024.**

In accordance with sub section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:.
(i) to show cause within thirty days of the service summons as to why the reliefs prayed for shouldnot be granted;
(ii)to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing or secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **13.09.2024 at 10:30 a.m.** at Debts Recovery Tribunal-II, 1stFloor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed should not be granted.

Take notice that in case of default the application will be heard and determined in your absence.

(Given under my hand and seal of this Tribunal on this the **29th day of August, 2024)**

**Registrar,**
**Debts Recovery Tribunal-II,**
**Hyderabad.**



**IN THE DEBTS RECOVERY TRIBUNAL- II, TRIVENI COMPLEX ( PALACE HEIGHTS) ABIDS, HYDERABAD - 500001**

**O.A. No. 330 OF 2023**

Between;
**UNION BANK OF INDIA**
Begumpet Br. ...APPLICANT
**AND**
**Ms.Yaram Anusha and another** ...DEFENDANTS

To,
**1. Ms.Yaram Anusha,** W/o. Sri. Edara Pranay, **2. Edara Pranay,** S/o. Sri. Inna Reddy, Both R/o. 4-3-27, Plot No.27, Balaji Kirana Stores, Mallikarjuna Nagar, Bandlaguda Jagir, K.V. Ranga Reddy Dist. Telangana-500086. Also at **S.S. Apearl,** Plot No. 127, 1st Floor, Prashanthnagar Colony, Bandlaguda Jagir-500086.

**SUMMONS /SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION**
**SUMMONS**

WHEREAS OA 330/2023 was listed before Hon'ble Presiding officer/ Registrar on 14-08-2024

Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons / Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 36,87,644.91/-** (Rupees Thirty Six Lakhs Eighty Seven Thousand Six Hundred Forty Four and Paise Ninty One Only).

In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under: -

**(i)** to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted; **(ii)** to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; **(iii)** you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; **(iv)** you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; **(v)** you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, on **24-09-2024** at 10:30 A.M. failing which the application shall be heard and decided in your absence.

**GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBUNAL ON THIS THE 20th DAY OF AUGUST 2024**

**Signature of the authorized officer to issue summons**

**M/s. SANGEETA JAISWAL,** Advocate, # 12-8-170, Mettuguda, Secunderabad.

# గణేశ్ ఉత్సవాలకు భారీ బందోబస్తు



**నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు : సీపీ సుధీర్ బాబు**
**వివిధ విభాగాల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో రాచకొండ సీపీ సమన్వయ సమావేశం**

**నేరేడ్‌మెంట్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

త్వరలో ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై రాచకొండ పోలీస్ కమీషనర్ శ్రీ సుధీర్ బాబు, ఐపీఎస్., భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో నెరెడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. హాజరైన వారితో చర్చించి క్షేత్ర స్థాయిలో గణేశ్ ఉత్సవ నిర్వాహకులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ గారు మాట్లాడుతూ.. గణేష్ విగ్రహాల ఏర్పాటు మరియు నిమజ్జనం ప్రణాళిక ప్రకారం జరిగేలా, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని పోలీసు శాఖ కృషి చేస్తోందని, కమిటీల నిర్వాహకులు కూడా సహకరించాలని తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుపుకొనే అతిపెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ వేడుకలను భక్తులు శాంతియుతంగా, ఘనంగా జరుపుకోవాలన్నారు. మండపాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గణేష్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని సూచించారు. ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, ప్రశాంతమైన వాతవరణంలో వేడుకలు జరిగేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల్లో డిజె ఏర్పాటుకు అనుమతి లేదని, గణేష్ మండపంలో రోజంతా వాలంటీర్లు తప్పనిసరిగా ఉండే విధంగా చూడాలని, రాత్రి సమయంలో కనీసం ముగ్గురు ఉండేలా చూసుకోవాలని మరియు, భక్తుల సందర్శనను దృష్టిలో వుంచుకుని మండపాలలో క్యూలైన్లను ఏర్పాటు చేసేలా నిర్వహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక ప్రాతిపదికన అయినా ఉత్సవాలు ముగిసే వరకు సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. సమీపంలో ఉన్న చెరువు లేదా కుంటల లోతును బట్టి విగ్రహాల ఎత్తును నిర్ణయించి ఏర్పాటు చేయాలని సూచించారు. గణేశ్ ఉత్సవ నిర్వాహకుల సౌలభ్యం కోసం ఇక నుండి రాచకొండ పోలీసు వెబ్‌సైట్ ఆన్‌లైన్ లింక్ ద్వారా స్థానిక పోలీసు వారికి నిర్ణీత వివరాలతో సమాచారం ఇవ్వాలని కమీషనర్ సూచించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన లింక్ https://policeportal.tspolice. gov.in/index.htmను రాచకొండ పోలీస్ సామాజిక మాధ్యమాల అకౌంట్లలో ఇప్పటికే పోస్టు చేయటం జరిగిందని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రోత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన రాచకొండ పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, నీటి పారుదల శాఖ, వైద్య శాఖ, విద్యుత్, రవాణా తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన మేరకు అన్ని శాఖల అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన బుక్ లెట్లను త్వరలోనే గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు అందిస్తామని పేర్కొన్నారు. వీరందరితో కలిసి సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరుపుకునేలా చూడాలన్నారు. నిమజ్జనోత్సవానికి అవసరమైన పోలీస్ బందోబస్తు, స్విమర్స్, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్, లైటింగ్స్, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, ఇతర నిమజ్జన నీటికుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, అవసరమున్న మేర క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లు, బారికేడ్లను, మంచినీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఏఎస్, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి ఎస్ బి కరుణాకర్, డిసిపి క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ మురలీధర్, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, ఎల్ బి నగర్ మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, పలువురు ఏసిపిలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బస్తీ దవాఖానను పరిశీలించిన కార్పొరేటర్



**నాచారం, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

మూడు గదులున్న బస్తీ దావఖానాను కార్పొరేటర్ శాంతి సాయి జనశేఖర్ ప్రత్యేక చొరవ తీసుకొని మరొక మూడు గదులను కూడా బస్తి దావఖానాలోకి కలపడం జరిగింది. అలాగే డాక్టర్లకు, పేషెంట్లకు కావాల్సిన బాత్రూంలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దాదాపు ఆరు నెలల నుంచి ఈ బస్తీ దావఖానాలో డాక్టర్ లేడు కేవలం స్టాఫ్ నర్సు నవనీత ఒక్కరే వస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు డాక్టర్‌ను ఏర్పాటు చేయలేకపోవడంపై కార్పొరేటర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు బస్తీదవాఖానాలో బీపీ మిషన్ పనిచేయకపోవడం లేదన్నారు. అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా డీఎంహెచ్‌వో తక్షణమే ఈ బస్తీ దవాఖానాలో డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. కార్పొరేటర్ వెంట గ్రేటర్ భారాస నాయకులు సాయి జన శేఖర్ మేకల ముత్యంరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై సమీక్ష

**గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**



**తార్నాక, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డితో కలిసి డిప్యూటీ మేయర్ ఇరిగేషన్, రెవెన్యూ సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. చెరువుల ఆక్రమణ, నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరద నీరు ప్రవహించి చెరువులోకి చేరకుండా అక్రమదారుల దుశ్చర్య వల్ల చెరువులలో చేరాల్సిన వరద నీరు కాలనీలలో ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బంది గురవుతున్నారని వారి దృష్టికి తీసుకువచ్చారు. నాలా చెరువులలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా తగిన చర్యలను చేపడుతూ అలాగే నిర్మాణాలు చేపట్టిన వారిపై హైడ్ర కు సమాచారం అందించి వాటికి సహకరించాలని ఆదేశించారు. చెరువులకు సంబంధించిన లేఅవుట్‌ను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేసి సర్వే నిర్వహించి చెరువులను కాపాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మారెడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్, సర్కిల్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టీపీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి ఏర్పాటు చేయండి

**తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి**



**తుర్కయంజాల్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మసాబ్ చెరువులో జరిగే గణేష్ నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయమని మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అధికారులతో కలిసి ఏర్పాట్లపై ఆరా తీశారు. గత సంవత్సరం కంటే ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున్న, రద్దీ లేకుండా చూడాలని కోరారు. ఇరిగేషన్, పోలీస్, ట్రాఫిక్, ఫిషరీష్, ఫారెస్ట్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనాలకు, మున్సిపాలిటీ ప్రజలు సహకరించాలని, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని ఈ సందర్భంగా చైర్ పర్సన్ అనురాధ రామిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్లు కుంట ఉదయ శ్రీ, గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బిక్షపతి, చంద్ర శేఖర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, హరీష్ పాల్గొన్నారు.

## పికిల్ బాల్‌కోర్టు పనులకు శంకుస్థాపన



**సైదాబాద్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

ఐఎస్ సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీలో పికిల్ బాల్ కోర్టు నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, రామ్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శేషు బాబు, వెంకటరామిరెడ్డి, యుగంధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేషరెడ్డి, లక్ష్మారెడ్డి, సూర్యారావు, రఘుపతి రెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కట్టపై చెత్త వేయొద్దంటూ ప్లకార్డులతో అవగాహన



**సైదాబాద్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

సరూర్ నగర్ మినీ ట్యాంక్ బండ్‌పై చెత్తను వేయవద్దంటూ చెరువు కట్టపై లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, ఏఎంహెచ్ఓ నగేష్ నాయక్‌లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు కట్టపై వెళ్లే వారికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సరూర్ నగర్ చెరువు కట్టపై నుంచి వెళ్లే వాహనదారులు తమ ఇళ్లలోని చెత్తను కట్టకు ఇరువైపులా పడేస్తున్నారని, దీనివల్ల దుర్వాసన, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎంతగా పని చేసినప్పటికీ ప్రజలు సహకరిస్తేనే పారిశుద్ధ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం..

**నేరేడ్‌మెట్, ఆగస్టు28 (ప్రభాతవార్త) :**



ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిరామ్ (38) బ్రతుకు దెరువు నిమిత్తం మునక్నగర్‌లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు నెలల క్రితం పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందినా అతని సోదరుడు తెలిసిన, బంధువుల ఇంట్లో వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో అతనికి సోదరుడు అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## డెంగ్యూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : జెడ్‌సి

**ఉప్పల్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**



డెంగ్యూ కేసులు పెరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హబ్సిగూడలో డెంగ్యూ అనుమానిత కేసును డిసి అంజనేయులు, ఎఎంహెచ్ఐ డా.మైత్రేయి, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్రెడ్డి తదితరులతో కలిసి హబ్సిగూడలో పర్యటించారు. డెంగ్యూ వ్యాధి కేసులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రూ. 36లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత



**ఉప్పల్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

చిలుకానగర్ డివిజన్లో రూ.36 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సిసి రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని, అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. పనుల విషయంలో రాజీ పడేది లేదన్నారు. డివిజన్లో ఇప్పటి వరకు కోట్లాది రూపాయలతో అనేక పనులు చేపట్టామని, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నిఖిల్రెడ్డి, ఎఇ రాజ్కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నేతలు ఏదుల కొండల్రెడ్డి, మాస శేఖర్, ఎండి షఫీ, శ్యామ్, సుందర్, అనసూయ, శైనాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు కార్పొరేటర్ ఫిర్యాదు

**ఎల్బీనగర్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**



కొత్తపేట డివిజన్ పరిధిలోని మూసి బఫర్ జోన్, రామలింగేశ్వర కాలనీలోని తెలంగాణ పార్క్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. బఫన్ జోన్ పరిధి ప్రాంతంలో పెద్దఎత్తున కబ్జాలకు గురైన వివరాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా శ్రీరామలింగేశ్వరకాలనీలోని 3.12 ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాగా, ప్రస్తుతం 19 గుంటలు మాత్రమే మిగిలి ఉందని, ప్రభుత్వ స్థలం పూర్తిగా కబ్జాకు గురైందని విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రా నగరంలో తీసుకుంటున్న చర్యల పట్ల హర్షం వ్యక్తం చేసిన కార్పొరేటర్ డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**హయత్‌నగర్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

విఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. కె.జ్యోత్స్నప్రభ వమాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో ముందుండాలని, క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగు పడుతుందని అన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నక్క శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... క్రీడల వల్ల దేశభక్తి, జాతీయస్ఫూర్తి అలవాడతాయన్నారు. ఈనెల 22 నుండి 28 వరకు వారం రోజుల పాటు విద్యార్థినీ విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పోటీలను నిర్వహించగా...విజేతలకు క్రీడా దినోత్సవ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డా. బి.నరసింహ సీనియర్ అధ్యాపకులు డా. ఎస్.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, యాదగిరిరెడ్డి మరియు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ సమస్యలు పరిష్కరించాలని వినతి

**తుర్కయంజాల్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

డిప్యూటీ ఇంజనీర్ విద్యుత్ శాఖ అధికారి పి.యాదగిరికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరాడి శ్రీలత అనిల్ కుమార్ కౌన్సిలర్ గురువారం మాట్లాడుతూ.. స్థానికంగా విద్యుత్ నిర్వహణ కోసం నూతన ట్రాన్స్‌ఫారం, కరెంటు పోల్స్ షిఫ్టింగ్, నూతనంగా వైర్లు స్తంభాలు ఏర్పాటు కోసం తక్కువ ఎత్తులో ఉన్న కరెంటు వైర్లను మరమ్మతులు చేయాలని తెలిపారు. స్థానికంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరడం జరిగింది. విద్యుత్ శాఖ అధికారి డీఈ పి.యాదగిరి, మాట్లాడుతూ.. సాధ్యమైనంత తొందరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి, తుల సుధాకర్‌గౌడ్, పండుగల రాము, బాలాజీ, పుట్టల దీక్షిత్, గొట్టే యోజిత్, యువాచ్ తదితరులు పాల్గొనడం జరిగింది.



## క్రీడాకారులకు అండగా ఉంటాం

**చైర్మన్ ముత్తినేని వీరయ్య**

**మలక్‌పేట్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**



క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ప్యారిస్‌లో జరగనున్న పారా ఒలంపిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన టానికి తెలంగాణ రాష్ట్రం నుంచి వెళ్తున్న జీవన్ జీ దీప్తిని చైర్మన్ ముత్తి నేని వీరయ్య శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారిని జీవన్ జీ దీప్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పారా క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించి ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సింగారపు బాబు గౌరవ సలహాదారుడు సంజీవయ్య ప్రధాన కార్యదర్శి గాడి పల్లి ప్రశాంత్ కోశాధికారి నూకరాజు నరేష్ యాదవ్ శ్రీనివాసరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బలాల



**మలక్‌పేట, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేటలోని దోబీ గల్లి, శంకర్‌నగర్, మదీనా కాలనీ, మలక్ పేట పట్టణ ఆరోగ్య కేంద్రం, తాళజాతివనం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, స్థానికులు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ మలక్ పేట డివిజన్ ఎంఐఎం నాయకుడు సైఫుద్దీన్ షఫీ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**వనస్థలిపురం, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

వనస్థలిపురం డివిజన్‌లోని క్రాంతి హిల్స్ కాలనీ నూతన కార్యవర్గం ఏర్పడింది. గౌరవాధ్యక్షుడుగా సి.యాదగిరిరెడ్డి, సలహాదారులుగా బి.రవీందర్‌రెడ్డి, జి.నాగేశ్వరరావు, అధ్యక్షుడుగా బద్దం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల సత్తిరెడ్డి, కోశాధికారిగా వి.మనోహర్, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా హాజి ముస్తాఫ్ అలీ,బి.గాలయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కె.రాం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, న్యాయ సలహాదారుగా సీహెచ్. ధనంజయ, ఈ.సి.మెంబర్లు గా లచ్చిరెడ్డి, శశివర్ధన్ రెడ్డిలు ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## సంక్షేమ సంఘ భవనం పనులు ప్రారంభం



**హయత్‌నగర్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**

కాలనీ వాసులంతా ఐకమత్యంగా ఉంటూ సంక్షేమ సంఘ భవనాన్ని నిర్మించుకోవడం హర్షణీయమని మాన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిసన్ పరిధి హయత్ నగర్‌లోని సాయిగణపతి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సంక్షేమ సంఘం భవనానికి ఆయన గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ముఖ్యంగా నూతన లైన్ వేయించి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వెంకటేష్, బాలాజీ, లక్ష్మణస్వామి, సత్యనారాయణ, నరసింహులు, జంగారెడ్డి, నాయకులు పారంద సాయి, కడారి యాదగిరి పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**తుర్కయంజాల్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**



ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి టీయూఎఫ్ నేతలు వినతి పత్రం అందజేశారు. టీయూఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవో అనంతరెడ్డిని ఉద్యమకారులు కలిశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 250గజాల స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు అధికారులు కూడా తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బర్ల జగదీశ్ యాదవ్, టీయూఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోసుపల్లి వీరేష్ కుమార్, మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల, గాజుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ సీఐ బదిలీ

**హయత్‌నగర్, ఆగస్టు 29 (ప్రభాతవార్త) :**



హయత్ ఇన్‌స్పెక్టర్‌గా పల్సా నాగరాజుగౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు హయత్‌నగర్‌లో సీఐగా పనిచేసిన రామకృష్ణను ఎస్బీకి బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.